తెహెల్కా
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రతి వార్త సంచలనం



# టీజీఎస్ ఆర్టీసీ ఉద్యోగులకు గుడ్ న్యూస్... పెరిగిన కరవు భత్యం

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఉద్యోగుల కరవు భత్యం (డీఏ) 2.1 శాతం పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ విషయాన్ని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారికంగా ప్రకటించారు. తాజా పెంపుతో ఆర్టీసీ ఉద్యోగుల డీఏ 50.7 శాతం నుంచి 52.8 శాతానికి చేరింది. ఈ నిర్ణయంతో సుమారు 38 వేల మందికి పైగా ఆర్టీసీ సిబ్బందికి లబ్ధి చేకూరనుంది. డీఏ పెంపు నిర్ణయం 2026 జనవరి నుంచే అమల్లోకి వస్తుందని మంత్రి పొన్నం స్పష్టం చేశారు. జనవరి నుంచి మార్చి వరకు మూడు నెలల బకాయిలను రాబోయే నెలల్లో సప్లిమెంటరీ బిల్లుల ద్వారా విడతలవారీగా చెల్లించనున్నట్లు తెలిపారు. ఈ డీఏ పెంపు వల్ల ఆర్టీసీపై ప్రతి నెలా అదనంగా రూ.2.82 కోట్ల ఆర్థిక భారం పడనుంది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమానికి పూర్తిగా కట్టుబడి ఉందని, ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని పునరుద్ఘాటించారు. సాధారణంగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉద్యోగులకు ఏటా జనవరి, జులై నెలల్లో డీఏను సవరిస్తారు. గత ఏడాది జులైలో కూడా ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వం 2.1 శాతం డీఏ పెంచింది. తాజాగా మరోసారి డీఏను పెంచుతూ నిర్ణయం తీసుకోవడం పట్ల ఉద్యోగ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న 'మహాలక్ష్మి' పథకం ఆర్టీసీకి ఆర్థికంగా ఊతమిస్తోంది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగి, సంస్థ ఆదాయం వృద్ధి చెందింది. గత ఆర్థిక సంవత్సరంలో ఫిబ్రవరి నాటికి ఆర్టీసీ సుమారు రూ.954 కోట్ల నిర్వహణ లాభాన్ని ఆర్జించింది. మహాలక్ష్మి పథకానికి సంబంధించిన రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఆర్టీసీకి చెల్లిస్తుండటంతో సంస్థ కార్యకలాపాలు సజావుగా సాగుతున్నాయి. ఇదే సమయంలో కొత్త బస్సులను కొనుగోలు చేసి, ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడం ద్వారా లాభాలను మరింత పెంచుకోవాలని ఆర్టీసీ యాజమాన్యం ప్రణాళికలు రచిస్తోంది.

# పీఎన్జీ కనెక్షన్లు వేగవంతం చేయండి.. రాష్ట్రంలో గ్యాస్ సరఫరాపై సీఎం చంద్రబాబు సమీక్ష

రాష్ట్రంలో గ్యాస్ సరఫరా, పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్జీ) కనెక్షన్ల పురోగతిపై ముఖ్యమంత్రి చంద్రబాబు సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. అంతర్జాతీయంగా యుద్ధాల కారణంగా ఎల్పీజీ గ్యాస్ సరఫరాలో తలెత్తుతున్న సవాళ్లను ఎదుర్కొనేందుకు పూర్తి సన్నద్ధతతో పనిచేయాలని అధికారులను, ఆయిల్ కంపెనీల ప్రతినిధులను ఆయన ఆదేశించారు. ప్రత్యామ్నాయంగా పీఎన్జీ వినియోగాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని స్పష్టం చేశారు. వచ్చే 6 నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా 10 లక్షల కొత్త పీఎన్జీ కనెక్షన్లు ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఈ విషయంలో ఎలాంటి జాప్యం జరగకూడదని, నిర్దేశిత లక్ష్యాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ చేరుకోవాలని తేల్చిచెప్పారు. ఈ సమీక్షలో భాగంగా 'దీపం' పథకం లబ్ధిదారులను పీఎన్జీ వైపు ప్రోత్సహించడంపై సీఎం ప్రత్యేకంగా దృష్టి సారించారు. దీపం లబ్ధిదారులు పీఎన్జీ కనెక్షన్‌కు మారితే, వారికి పథకం కింద అందే రాయితీ సొమ్మును యథావిధిగా వారి ఖాతాల్లో జమ చేయాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకుందని గుర్తుచేశారు. ఈ విషయంపై లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని, సంబంధిత ఉత్తర్వులను తక్షణమే జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. పీఎన్జీ వాడకం సురక్షితమని, చౌక అని ప్రజలకు వివరించాలన్నారు. ప్రస్తుతం గృహ అవసరాలకు గ్యాస్ సరఫరాలో ఇబ్బందులను అధిగమించామని, త్వరలోనే పరిస్థితి సాధారణ స్థితికి వస్తుందని అధికారులు సీఎంకు వివరించారు. ఇదే సమయంలో శ్రీకాకుళం-కాకినాడ నేచురల్ గ్యాస్ పైప్‌లైన్ పనుల్లో జాప్యంపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. కేంద్రం నుంచి కొన్ని అనుమతులు రావాల్సి ఉందని అధికారులు చెప్పడంతో, సమీక్ష సమావేశం నుంచే కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీకి చంద్రబాబు ఫోన్ చేశారు. టెండర్ల ప్రక్రియ పూర్తయినందున, పనులను వేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించి, త్వరలోనే సమీక్షించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# నాటో దేశాల తీరుపై ట్రంప్ మరోసారి విసుర్లు

షెహబాజ్ షరీఫ్ హామీ ఇచ్చారు. అయితే, ఈ చర్చలకు ముందే ఓ కీలక పరిణామం చోటుచేసుకుంది. లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు చేయడాన్ని ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియన్ తీవ్రంగా తప్పుపట్టారు. ఇది కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించడమేనని, ఇలాంటి పరిస్థితుల్లో చర్చలు జరపడం అర్థరహితమని ఆయన స్పష్టం చేశారు. మరోవైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, నాటో మిత్రదేశాలపై మరోసారి తన అసహనాన్ని వ్యక్తం చేశారు. "ఒత్తిడి చేస్తే తప్ప మనల్ని నిరాశపరిచే నాటో సహా మిత్ర దేశాలకు ఏమీ అర్థం కాదు" అని ఆయన తన ట్రూత్ సోషల్ ఖాతాలో పోస్ట్ చేశారు.

గతంలో ఇరాన్‌పై చర్యలు, హర్మూజ్ జలసంధి వద్ద భద్రతవిషయంలో నాటో దేశాలు సహకరించలేదని ట్రంప్ తీవ్ర అసంతృప్తితో ఉన్న సంగతి తెలిసిందే.

# కాలిపోయిన నోట్ల కట్టల కేసు.. జస్టిస్ యశ్వంత్ వర్మ పదవికి రాజీనామా

అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ తన పదవికి ఆకస్మికంగా రాజీనామా చేశారు. తనపై అభిశంసన ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో ఆయన ఈ అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. తన రాజీనామా లేఖను రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు పంపారు. ఈ లేఖ కాపీని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్‌కు కూడా పంపినట్లు తెలిసింది. గతేడాది మార్చి 14న జస్టిస్ వర్మ ఢిల్లీ హైకోర్టు జడ్జిగా ఉన్నప్పుడు ఆయన అధికారిక నివాసంలోని ఔట్‌హౌస్‌లో కాలిపోయిన నోట్ల కట్టలు దొరికాయన్న ఆరోపణలతో ఆయన తీవ్ర వివాదంలో చిక్కుకున్నారు. ఈ ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. దీని ఫలితంగా 2025 జులైలో లోక్‌సభలో 145 మంది, రాజ్యసభలో 63 మంది ఎంపీలు ఆయనపై అభిశంసన తీర్మానానికి నోటీసులు ఇచ్చారు. దీంతో లోక్‌సభ స్పీకర్ 'జడ్జెస్ (ఇన్‌క్వైరీ) యాక్ట్, 1968' ప్రకారం ఆరోపణలపై దర్యాప్తు చేసేందుకు ముగ్గురు సభ్యులతో కూడిన విచారణ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ఏర్పాటును జస్టిస్ వర్మ సుప్రీంకోర్టులో సవాలు చేశారు. అయితే, ఆయన పిటిషన్‌ను జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మలతో కూడిన ధర్మాసనం తోసిపుచ్చింది. అంతకుముందు సుప్రీంకోర్టు అంతర్గత కమిటీ ఇచ్చిన నివేదికను సవాల్ చేసినా ఆయనకు చుక్కెదురైంది. తన రాజీనామా లేఖలో... "తీవ్ర ఆవేదనతో ఈ పదవి నుంచి వైదొలగుతున్నాను. నా రాజీనామాకు గల కారణాలు తెలిపి మీ ఉన్నత కార్యాలయానికి భారం కలిగించదలచుకోలేదు. ఈ పదవిలో సేవ చేయడం గౌరవంగా భావిస్తున్నాను" అని జస్టిస్ వర్మ పేర్కొన్నారు. అన్ని వైపుల నుంచి ఒత్తిడి పెరగడంతోనే ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

# యూపీలో పడవ బోల్తా...

ఢీకొనడంతో పడవ ఒక్కసారిగా బోల్తా పడిందని చెప్పారు. మరోవైపు, విషయం తెలుసుకున్న రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం (ఎస్‌డీఆర్ఎఫ్), జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్‌డీఆర్ఎఫ్) బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారు. వీరితో పాటు సుమారు 50 మంది స్థానిక డైవర్లు కూడా రెస్క్యూలో పాల్గొన్నారు.

"ప్రమాదానికి గురైన బోటులో సుమారు 25 నుంచి 27 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. ఇప్పటివరకు ప్రత్యక్ష సాక్షులు అందించిన వివరాల ఆధారంగా చూస్తే, పడవ పాంటూన్ వంతెనను ఢీకొట్టడమే ఈ ప్రమాదానికి ప్రాథమిక కారణమని తెలుస్తోంది. ఘటనా స్థలి నుంచి ఇప్పటివరకు పది మృతదేహాలను వెలికితీశారు. అగ్నిమాపక, పోలీసు శాఖల బృందాలు, స్థానిక ఈతగాళ్లు, పడవ నడిపే వారితో సహా సహాయక చర్యల్లో పాల్గొన్నారు."

**సహాయ చర్యలు వేగవంతం చేయాలి : యూపీ సీఎం**

ఈ ఘటనపై ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ స్పందించారు. బాధితుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అధికారులు సంఘటనా స్థలానికి వెంటనే చేరుకుని, సహాయక చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు. అలాగే ఈ దురదృష్టకర ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు తగిన పరిహారం అందేలా చూడాలని ఆయన అధికారులను ఆదేశించారు.

ఈ ప్రమాద ఘటనపై ఆగ్రా జోన్ ఏడీజీ అనుపమ కులశ్రేష్ఠ మీడియాతో మాట్లాడారు. ఘటనా స్థలిలో రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోందన్నారు. పడవలో సుమారు 25-27 మంది ఉన్నారని, అయితే కచ్చితమైన సంఖ్య ఇంకా తెలియరాలేదు చెప్పారు. రెస్క్యూ ఆపరేషన్‌లో ఇప్పటివరకు 13 మందిని సురక్షితంగా రక్షించామని పేర్కొన్నారు. గల్లంతైన వారికోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని వివరించారు.

# ఆలయాల్లోకి కొందరికే ప్రవేశమా?.. హిందూమతానికే మంచిది కాదు: సుప్రీంకోర్టు

చేసింది. శబరిమల ఆలయంలోకి మహిళల ప్రవేశం కేసు నుంచి ఉద్భవించిన మత స్వేచ్ఛ, వివక్షకు సంబంధించిన పిటిషన్లపై ధర్మాసనం విచారణ జరుపుతోంది. ఈ సందర్భంగా కొన్ని వర్గాలకు చెందిన ఆలయాల్లోకి కేవలం ఆ వర్గం వారినే అనుమతించాలని, బయటివారికి ప్రవేశంపై నియంత్రణ విధించే హక్కు తమకుందని నాయర్ సర్వీస్ సొసైటీ తరఫున సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్ వాదించారు. ఈ వాదనపై ధర్మాసనం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. జస్టిస్ బీవీ నాగరత్న మాట్లాడుతూ.. "ప్రతి ఒక్కరికీ ప్రతి ఆలయంలో, మఠంలో ప్రవేశం ఉండాలి. ఇతరులను అనుమతించకుండా కేవలం మా వర్గం వారే వస్తారనడం హిందూమతానికి మంచిది కాదు. దీనివల్ల ఆ మతానికే నష్టం వాటిల్లుతుంది" అని వ్యాఖ్యానించారు. ఇలాంటి పద్ధతులు సమాజాన్ని విభజిస్తాయని జస్టిస్ అరవింద్ కుమార్ కూడా అభిప్రాయపడ్డారు. 2018లో శబరిమల ఆలయంలోకి అన్ని వయసుల మహిళలను అనుమతిస్తూ ఐదుగురు సభ్యుల ధర్మాసనం తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే.

ఆ తీర్పుపై దాఖలైన సమీక్ష పిటిషన్లను విచారించిన మరో ధర్మాసనం, మత స్వేచ్ఛకు సంబంధించిన విస్తృత రాజ్యాంగపరమైన ఏడు ప్రశ్నలను ప్రస్తుత తొమ్మిది మంది సభ్యుల ధర్మాసనానికి బదిలీ చేసింది. ప్రస్తుతం ఈ ధర్మాసనం కేవలం ఒక్క కేసుకే పరిమితం కాకుండా రాజ్యాంగం ప్రకారం మత స్వేచ్ఛ పరిధిపై విస్తృత స్థాయిలో విచారణ జరుపుతోంది.

# గుంపు మేస్త్రీ అంటూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యంగా కల్వకుంట్ల కవిత ఘాటు విమర్శలు

హైదరాబాద్ నగరాభివృద్ధి ముసుగులో జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ పరిధిలో భారీ ఎత్తున అవినీతి జరుగుతోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన ఆరోపణలు చేశారు. ఈరోజు మీడియాతో మాట్లాడిన ఆమె, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వంపై విమర్శనాస్త్రాలు సంధించారు. ప్రధానంగా హెచ్ఎండీఏ పరిధిలో సుమారు 35 వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను విక్రయానికి పెట్టారని, అయితే ఆ నిధులను నగర అభివృద్ధికి వెచ్చించకుండా దారి మళ్లిస్తున్నారని ఆమె ఆరోపించారు. హెచ్ఎండీఏకు చైర్మన్‌గా, వైస్ చైర్మన్‌గా స్వయంగా ముఖ్యమంత్రే ఉన్నారని గుర్తు చేస్తూ, ప్లానింగ్ డిపార్ట్‌మెంట్‌లో ఆయన అనుచరుల కనుసన్నల్లోనే పనులు జరుగుతున్నాయని ధ్వజమెత్తారు. ముఖ్యంగా టెండర్ల ప్రక్రియలో నిబంధనలను తుంగలో తొక్కారని కవిత ఆరోపించారు. గతంలో నామినేషన్ పద్ధతిలో జరిగిన పనుల కంటే, రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత సుమారు 1,140 కోట్ల రూపాయల కాంట్రాక్టులను అదే పద్ధతిలో అప్పగించారని, ఇది ఆర్థిక శాఖ నిబంధనలకు విరుద్ధమని ఆమె పేర్కొన్నారు.

పారదర్శకమైన టెండర్ల ద్వారా ప్రభుత్వానికి వచ్చే ఆదాయానికి గండికొట్టి, కేవలం అవినీతి కోసమే 'ఫ్యూచర్ సిటీ' పేరుతో సరికొత్త నాటకాలకు తెరలేపారని విమర్శించారు. జీహెచ్ఎంసీ పాలన ప్రస్తుతం 'గుంపు మేస్త్రి' చేతుల్లో చిక్కి మహా అవినీతికి నిలయంగా మారిందని ఆమె వ్యాఖ్యానించారు. ఔటర్ రింగ్ రోడ్డు వ్యవహారంలో గతంలో సిట్ వేయించిన ముఖ్యమంత్రి, ఇప్పుడు అదే కాంట్రాక్టును ఎలా కొనసాగిస్తున్నారని ఆమె ప్రశ్నించారు.

# అన్నా.. నన్ను దేవుడే పంపిండు మీతో కలిసి పని చేయమని..



ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్సీ ఎల్ రమణ, ఎమ్మెల్యే డా. కె.సంజయ్, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్, మాజీ ఎమ్మెల్యే కె. విద్యాసాగర్ రావు, పార్టీ నేతలు గ్యాదరి బాలమల్లు, మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి తదితరులున్నారు. జీవన్ రెడ్డి తో పాటు వారి కుమారులు, జగిత్యాల మాజీ జడ్పీ చైర్ పర్సన్ వసంత సురేశ్ దంపతులు తదితరులున్నారు. నిరంతరం తన నియోజకవర్గం, జిల్లా ప్రజలు, రైతుల గురించి ఆలోచన చేసే రైతు నాయకుడు, తెలంగాణ తనానికి దర్పణంగా నిలిచే మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి., తెలంగాణ సాధకుడు రైతు బాంధవుడు బిఆర్ఎస్ అధినేత కెసీఆర్‌ల కలయిక సందర్భంగా భావోద్వేగ వాతావరణం నెలకొంది.

తెలంగాణకు నష్టం జరుగుతున్న సమయంలో మీతో కలిసి పనిచేయాల్సిన అవసరమున్నదని, మీతో కలిసి పనిచేయమని దేవుడే నన్ను మీదగ్గరికి పంపించిండు అన్నా అంటూ చాలా గ్యాప్ తర్వాత ఇన్నాల్లకైనా మీతో కలిసిపనిచేసే అవకాశం రావడం సంతోషంగా వుంది అన్నా అంటూ తన మనసులో మాటన జీవన్ రెడ్డి వ్యక్తం చేశారు. కాగా జీవన్ రెడ్డిని అనునయిస్తూ వారిని అప్యాయంగా దగ్గరికి తీసుకున్న కేసీఆర్ వారిని హృదయపూర్వకంగా ఆలింగనం చేసుకొని, దుశ్శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం ఇచ్చి ఆహ్వానించారు. కాసేపు ఇష్టాగోష్టి తర్వాత జీవన్ రెడ్డి బృందాన్ని లంచ్ ఆతిథ్యానికి కేసీఆర్ ఆహ్వానించారు.

# బీఆర్ఎస్ ఆరోపణలపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తిన పొంగులేటి.. తాటాకు చప్పుళ్లకు బెదిరేది లేదని వ్యాఖ్య

తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీపై నిప్పులు చెరిగారు. రాజకీయ విమర్శల విషయంలో మంత్రి పొంగులేటి మరింత ఘాటుగా స్పందిస్తూ, తమకు అంటిన బురదను అధికార పార్టీ నేతలకు అంటించాలని కొంతమంది ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు.

ఎవరు ఎన్ని అవాకులు చవాకులు పేలినా, కారు కూతలు కూసినా ఈ ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తుందని, ప్రతిపక్షాల తాటాకు చప్పుళ్లకు తాము బెదిరే ప్రసక్తే లేదని హెచ్చరించారు. భవిష్యత్తులో కూడా ఇందిరమ్మ రాజ్యాన్ని ప్రజలు దీవించడానికి సిద్ధంగా ఉన్నారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం చేగొమ్మలో నూతనంగా నిర్మించిన గోదాము ప్రారంభోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, ధాన్యం సేకరించిన వారం రోజుల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని స్పష్టం చేశారు.రైతు సంక్షేమమే ధ్యేయంగా రైతు భరోసా కింద ప్రతి ఎకరానికి రూ. 12,000 అందిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్ వల్ల రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులను తొలగించేందుకు దానిని బంగాళాఖాతంలో కలిపి, పారదర్శకమైన 'భూ భారతి' విధానాన్ని తీసుకొచ్చామని ఆయన పేర్కొన్నారు. దీని ద్వారా ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా మూడు లక్షల ఎనభై వేల మంది రైతులకు కొత్త పాస్ పుస్తకాలు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. సన్న వడ్లకు మద్దతు ధరతో పాటు అదనంగా ఐదు వందల రూపాయల బోనస్ ఇస్తున్నామని, పండించిన సన్న బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు తరలించకుండా రేషన్ ద్వారా రాష్ట్రంలోని పేదలకు అందిస్తున్నామని మంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం కలెక్టర్ దురిశెట్టి అనుదీప్, సీపీ సునీల్ దత్ మరియు పలువురు కార్పొరేషన్ చైర్మన్లు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# లొంగిపోయిన 42 మంది మావోయిస్టులు.. కీలక వ్యాఖ్యలు చేసిన తెలంగాణ డీజీపీ

తెలంగాణలో మావోయిస్టుల కార్యకలాపాలు క్రమంగా తగ్గుముఖం పడుతుండగా, తాజాగా భారీ సంఖ్యలో మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయారు. రాష్ట్ర డీజీపీ శివధర్‌రెడ్డి సమక్షంలో మొత్తం 42 మంది మావోయిస్టులు తమ ఆయుధాలను వదిలి ఈరోజు జనజీవన స్రవంతిలోకి చేరారు. లొంగిపోయిన వారిలో బెటాలియన్ డిప్యూటీ కమాండర్ స్థాయి కలిగిన కేశాలు వంటి కీలక నేతలు ఉండటం విశేషం. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ, గత ఏడాదిన్నర కాలంలోనే మొత్తం 763 మంది మావోయిస్టులు హింసా మార్గాన్ని వీడి ప్రభుత్వానికి లొంగిపోయారని వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతాల్లో పోలీసుల కూంబింగ్ కార్యకలాపాలు ముమ్మరం కావడంతో, తమ రక్షణ కోసం మావోయిస్టులు తెలంగాణ పోలీసులను ఆశ్రయిస్తున్నట్లు ఆయన పేరొన్నారు. లొంగిపోయిన వారిలో అత్యధికులు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన వారేనని, తెలంగాణకు చెందిన వారు కేవలం ఒక్కరే ఉన్నారని డీజీపీ స్పష్టం చేశారు.

ఒకప్పుడు సెంట్రల్ కమిటీ, స్టేట్ కమిటీల్లో తెలంగాణ వాసుల ప్రాతినిధ్యం ఎక్కువగా ఉండేదని, కానీ ప్రస్తుతం ఆ సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందని ఆయన వివరించారు. సెంట్రల్ కమిటీలో 11 మంది నుంచి ఇద్దరు, స్టేట్ కమిటీలో 24 మంది నుంచి కేవలం ఇద్దరు మాత్రమే మిగిలారని, వారు కూడా త్వరలోనే లొంగిపోవాలని ఆయన పిలుపునిచ్చారు. లొంగిపోయిన 42 మందికి పునరావాస ప్యాకేజీ కింద రూ. 1.93 కోట్ల నగదును అందజేయడంతో పాటు, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు వారికి ప్రత్యేక ఆరోగ్య కార్డులను కూడా జారీ చేయనున్నట్లు డీజీపీ వెల్లడించారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ పునరావాస అవకాశాలను అందిపుచ్చుకుని, అడవి బాట పట్టిన వారంతా తిరిగి రావాలని పోలీసుల విజ్ఞప్తి చేస్తున్నారు.

# నమాజ్ కోసం ఉగ్రవాదులపై దాడిని వాయిదా వేశాం.. ఆపరేషన్ సిందూర్ రహస్యాలు వెల్లడించిన ఆర్మీ చీఫ్

భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది ఒక కీలక విషయాన్ని వెల్లడించారు. ఉగ్రవాద శిబిరంపై 'ఆపరేషన్ సిందూర్' పేరుతో దాడి చేసేందుకు సిద్ధమైనప్పుడు, అక్కడ ఉగ్రవాదులు నమాజ్ చేస్తున్నారని తెలిసి దాడిని ఉద్దేశపూర్వకంగా వాయిదా వేసినట్లు తెలిపారు. సైనిక లక్ష్యాలతో పాటు మానవతా విలువలకు కూడా ప్రాధాన్యత ఇస్తామని చెప్పడానికి ఇది నిదర్శనమని ఆయన పేర్కొన్నారు.రిషభ్ షా హోస్ట్‌గా వ్యవహరిస్తున్న ఐఐఎంయూఎన్ వారి 'బిఫోర్ ఐ బికేమ్ మీ' అనే పాడ్‌కాస్ట్‌లో జనరల్ ద్వివేది మాట్లాడారు. "మేము ఆ లక్ష్యాలను ఎప్పుడైనా ధ్వంసం చేయవచ్చు. కానీ, అవతలి వైపు ఉగ్రవాద శిబిరంలో వారు నమాజ్ చేస్తున్న సమయంలో దాడి చేయకూడదని నిర్ణయించుకున్నాం. ఎందుకంటే అందరి దేవుడు ఒక్కడే. అందుకే వారు ప్రార్థనలో లేని సమయాన్ని ఎంచుకున్నాం" అని ద్వివేది వివరించారు.ఈ సందర్భంగా తన వ్యక్తిగత జీవితం, నాయకత్వ శైలి గురించి కూడా ఆయన పంచుకున్నారు. సైన్యంలో మహిళల చేరిక, పని వాతావరణం వంటి విషయాల్లో తన కుమార్తెలు మార్గనిర్దేశం చేస్తారని తెలిపారు. "వారు చెప్పే విషయాలను నేను చాలా సీరియస్‌గా తీసుకుంటాను. అవసరమైన చోట వాటిని అమలు చేస్తాను. వారే నాకు ఈ మార్పులను ఎలా స్వీకరించాలో నేర్పారు" అని ఆయన అన్నారు.

తన సైనిక్ స్కూల్, నేషనల్ డిఫెన్స్ అకాడమీ రోజుల గురించి మాట్లాడుతూ, మార్కుల కన్నా వైఖరి, పరిస్థితులకు అనుగుణంగా మారగలగడమే ముఖ్యమని జనరల్ ద్వివేది అభిప్రాయపడ్డారు. "మార్కులు కేవలం చదువులోని ప్రతిభకు సూచిక మాత్రమే, అవి మీ వ్యక్తిత్వాన్ని నిర్ధారించలేవు" అని ఆయన వ్యాఖ్యానించారు. అత్యంత క్లిష్టమైన కౌంటర్ టెర్రరిజం ఆపరేషన్లలో నైతిక సందిగ్ధత ఎదురైనప్పుడు, ప్రశాంతంగా నిర్ణయాలు తీసుకోవడానికి భగవద్గీత, ఇతర ఆధ్యాత్మిక గ్రంథాలు ఎంతగానో సహాయపడతాయని జనరల్ ద్వివేది తెలిపారు.

# ఇజ్రాయెల్ ఒక దుర్మార్గమైన, మానవాళికి శాపమైన దేశం.. పాక్ మంత్రి సంచలన వ్యాఖ్యలు

అమెరికా-ఇరాన్ మధ్య కీలక శాంతి చర్చలకు ఆతిథ్యం ఇచ్చేందుకు సిద్ధమవుతున్న పాకిస్థాన్‌కు ఊహించని దౌత్యపర మైన చిక్కు ఎదురైంది. లెబనాన్‌లో ఇజ్రాయెల్ "జాతి నిర్మూలన" కు పాల్పడుతోందంటూ పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ చేసిన తీవ్ర వ్యాఖ్యలు పెను దుమారం రేపాయి. ఈ వ్యాఖ్యలపై ఇజ్రాయెల్ తీవ్రంగా స్పందించడంతో, ఇరు దేశాల మధ్య మాటల యుద్ధం మొదలైంది. ఇస్లామాబాద్‌లో అమెరికా-ఇరాన్ చర్చలు జరగాల్సి ఉండగా, ఖవాజా అసిఫ్ సోషల్ మీడియా వేదికగా ఇజ్రాయెల్‌ను లక్ష్యంగా చేసుకున్నారు. "ఇజ్రాయెల్ ఒక దుర్మార్గమైన, మానవాళికి శాపమైన దేశం. పాలస్తీనా భూభాగంలో ఏర్పడిన ఈ క్యాన్సర్ లాంటి దేశాన్ని సృష్టించిన వారు నరకంలో కాలిపోవాలి," అని ఆయన వ్యాఖ్యానించారు. గాజా, ఇరాన్ తర్వాత ఇప్పుడు లెబనాన్‌లో ఇజ్రాయెల్ రక్తపాతం సృష్టిస్తోందని ఆరోపించారు.

అసిఫ్ వ్యాఖ్యలను ఇజ్రాయెల్ తీవ్రంగా ఖండించింది. ఇవి అత్యంత దారుణమైనవని, తమ దేశ వినాశనాన్ని కోరేలా ఉన్నాయని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి కార్యాలయం పేర్కొంది. "శాంతి మధ్యవర్తిగా చెప్పుకుంటున్న దేశం నుంచి ఇలాంటి వ్యాఖ్యలను ఎంతమాత్రం సహించలేం" అని స్పష్టం చేసింది. ఇవి యూదు వ్యతిరేక వ్యాఖ్యలని, తమ దేశాన్ని నాశనం చేయాలని పిలుపునిస్తున్న ఉగ్రవాదుల నుంచి ఇజ్రాయెల్ తనను తాను రక్షించుకుంటుందని విదేశాంగ మంత్రి గిడియాన్ సార్ హెచ్చరించారు. అమెరికా-ఇరాన్ మధ్య రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం కుదరడంలో పాకిస్థాన్ కీలక పాత్ర పోషించింది. ఇప్పుడు ఈ దౌత్యపరమైన వివాదం ఇస్లామాబాద్ మధ్యవర్తిత్వ ప్రయత్నాలకు పెద్ద అడ్డంకిగా మారింది. మరోవైపు, హర్మూజ్ జలసంధిలో చమురు రవాణాకు ఇబ్బందులు తలెత్తడంతో అమెరికా-ఇరాన్ కాల్పుల విరమణ కూడా ప్రమాదంలో పడింది. ఒప్పందం ప్రకారం ఇరాన్ నడుచుకోవడం లేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆరోపించడం ఉద్రిక్తతలను మరింత పెంచుతోంది.

# ఢిల్లీ రాజకీయాల్లోకి నితీశ్ కుమార్.. రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణం

బీహార్ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ శుక్రవారం రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ నేపథ్యంలో త్వరలోనే సీఎం పదవికి రాజీనామా చేస్తానని ఆయన స్వయంగా ప్రకటించారు. దీంతో బీహార్‌లో నాయకత్వ మార్పు ఖాయమైపోయింది. గురువారం మధ్యాహ్నం ఢిల్లీకి చేరుకున్న నితీశ్ కుమార్, విలేకరులతో మాట్లాడుతూ తన నిర్ణయాన్ని సమర్థించుకున్నారు. "బీహార్‌లో నేను చాలా పనులు పూర్తి చేశాను. ఇకపై ఇక్కడే (ఢిల్లీలో) ఉండాలని భావిస్తున్నాను. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నాను. మూడు, నాలుగు రోజుల్లో ముఖ్యమంత్రి పదవి నుంచి తప్పుకుంటాను. కొత్తగా ముఖ్యమంత్రి, మంత్రులు నియమితులవుతారు" అని ఆయన స్పష్టం చేశారు.

ఆయన వెంట జేడీ(యూ) జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ సంజయ్ ఝా, మంత్రి విజయ్ కుమార్ చౌదరి ఉన్నారు. ఏప్రిల్ 13 తర్వాత బీహార్‌లో కొత్త ప్రభుత్వ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమవుతుందని సంజయ్ ఝా ఇదివరకే సూచించగా, నితీశ్ తాజా వ్యాఖ్యలతో ఈ మార్పు వేగవంతం కానుందని తేలిపోయింది. మరోవైపు, 'నితీశ్ మోడల్' పాలనను కొనసాగిస్తామని, ఎన్డీయే కూటమి ఐక్యంగా ఉందని మంత్రి విజయ్ చౌదరి తెలిపారు. రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణం చేసిన తర్వాత నితీశ్ కుమార్.. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో కీలక సమావేశంలో పాల్గొననున్నారు. బీహార్ తదుపరి ముఖ్యమంత్రి ఎంపిక, మంత్రిత్వ శాఖల పంపకాలపై ఈ భేటీలో తుది నిర్ణయం తీసుకోనున్నారు. ఇదే సమయంలో, బీహార్ ఉప ముఖ్యమంత్రులు సామ్రాట్ చౌదరి, విజయ్ కుమార్ సిన్హా కూడా ఢిల్లీకి చేరుకున్నారు. బీజేపీ కోర్ కమిటీ సమావేశంలో వారు పాల్గొని, నాయకత్వ మార్పుపై చర్చించనున్నారు.

# చర్చల కోసం పాకిస్థాన్ బయల్దేరిన అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్.. ఇరాన్‌కు వార్నింగ్

అమెరికా, ఇరాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతల నడుమ చర్చల ప్రక్రియకు మార్గం సుగమమవుతోంది. ఇరాన్‌తో చర్చలు జరిపేందుకు అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ శుక్రవారం పాకిస్థాన్‌కు బయల్దేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇరాన్ నిజాయతీతో చర్చలకు వస్తే స్నేహ హస్తం అందించడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, కానీ మోసపూరితంగా వ్యవహరించాలని చూస్తే మాత్రం తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు.

ఇస్లామాబాద్‌కు బయల్దేరే ముందు జాయింట్ బేస్ ఆండ్రూస్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. "చర్చల కోసం మేం ఎదురుచూస్తున్నాం. ఇవి సానుకూలంగా జరుగుతాయని ఆశిస్తున్నాను. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పినట్లుగా, ఇరాన్ నిజాయతీతో చర్చలకు వస్తే మేం తప్పకుండా స్నేహ హస్తం అందిస్తాం. అదే సమయంలో, మాతో ఆటలాడాలని చూస్తే మా చర్చల బృందం అంత సుముఖంగా ఉండబోదని వాళ్లు తెలుసుకోవాలి" అని వాన్స్ స్పష్టం చేశారు. అధ్యక్షుడు ట్రంప్ నిర్దేశించిన స్పష్టమైన మార్గదర్శకాలతోనే తాము చర్చలకు వెళ్తున్నామని ఆయన తెలిపారు. ప్రస్తుతం అమెరికా, ఇరాన్ మధ్య రెండు వారాల కాల్పుల విరమణ అమల్లో ఉంది. ఈ నేపథ్యంలో జరుగుతున్న ఈ చర్చలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. అయితే, వాన్స్ పర్యటనకు సంబంధించిన పూర్తి షెడ్యూల్‌ను అధికారులు ఇంకా విడుదల చేయలేదు. గల్ఫ్ ప్రాంతంలో స్థిరత్వం, ఇంధన సరఫరా వంటి అంశాల కారణంగా ఈ పరిణామాలను భారత్ నిశితంగా గమనిస్తోంది. గతంలో ఇరు దేశాల మధ్య జరిగిన చర్చలు విఫలమైన నేపథ్యంలో, తాజా ప్రయత్నాలు ఎంతవరకు ఫలిస్తాయో వేచి చూడాలి.

# పేదల ప్రభుత్వంపై ప్రతిపక్షాల బురద రాజకీయం వారికంటిన బురదను మాకు అంటించే ప్రయత్నం





**రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

ఖమ్మం / హైదరాబాద్ :- ప్రతిపక్షానికి చెందిన కొంతమంది వారికి అంటిన బురదని అధికార పార్టీకీ, అధికార పార్టీ నాయకులకు అంటించాలని చూస్తున్నారని ఎవరు ఎన్ని కారుకూతలు కూసిన భవిష్యత్తు లో ఇందిరమ్మ ప్రభుత్వం ని ప్రజలు దీవించడానికి సిద్ధంగా ఉన్నారని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం నాడు ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం చేగొమ్మలో 1.52 కోట్లతో నిర్మించిన ప్యాక్స్ గోదాములను ప్రారంభించారు. అలాగే మండలంలో 191 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ. 58.58 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ ఎవరు ఎన్ని అవాకులు చవాకులు పేలిన ఈ ప్రభుత్వం పేదవారికి అండగా ఉంటుందన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామని ధాన్యం కొన్న వారం రోజుల్లోనే రైతుల ఖాతాలో నగదు జమ చేస్తున్నామని తెలిపారు. రైతును రాజు చేయడమే ప్రభుత్వ ప్రధాన సంకల్పమని పేర్కొన్నారు. కేవలం నాలుగు నెలల్లోనే రూ. 20,670 కోట్ల మేర రుణమాఫీ చేసి చరిత్ర సృష్టించామని ఏడాదికి ఎకరానికి రూ. 12 వేలు అందిస్తూ, సన్న వడ్లకు రూ. 500 బోనస్ ఇస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కొత్త గా 3.80 లక్షల మందికి పాస్ పుస్తకాలను అందజేశామన్నారు. ధరణి తో రైతులు ఇబ్బందులు పడ్డారని దాన్ని బంగాళాఖాతంలో వేసి భూ భారతి తీసుకొచ్చామని తెలిపారు. అనంతరం వెంకటాపురంలో దేపంగి శ్రీకాంత్ నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో పాల్గొన్న మంత్రి.. అర్హులైన ప్రతి పేదవాడికి సొంతింటి కల నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. మంత్రి వెంట జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సీపీ సునీల్ దత్, మునిసిపల్ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, పాలేరు ప్రత్యేక అధికారి రమేష్, ఆర్డీఓ శ్రీనివాస్, వ్యవసాయ అధికారి పుల్లయ్య, తహసీల్దార్ సైదులు, ఎంపీడీఓ, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## నేతన్న భరోసా,చేనేత రుణమాఫీ నేతన్న భద్రత నేతన్న భీమాచెక్కు ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి.





యాదాద్రి భువనగిరి.తేహెల్కా న్యూస్:భువనగిరి పట్టణంలో రాయగిరి లింగ బసవ గార్డెన్లో నేతన్నభరోసా చేనేత రుణమాఫీ,నేతన్న భద్రత నేతన్న భీమా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం,శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి,నేతన్న పొదుపు పథకం 4081మంది కార్మికులకు అనుబంధ కార్మికుని కి కలిపి1.65 కోట్లు విడుదల చే యడం జరిగింది. నేతన్న భీమా పథకం కింద భువన గిరి నియోజకవర్గం లోనే14మంది చే నేత కార్మికులకు 70 లక్షలు విడుదల చేయడం జరిగింది.నేతన్న భరోసా పథకం కింద భువ నగిరి నియోజక వర్గంలోనే 4063 చేనేత కార్మికులకుమరియుఅను బంధ కార్మికులకు మూడు నెలల కు గానూ1.25కోట్లు విడుదల చే యడం జరిగింది.చేనేత ఋణ మాఫి మిగిలిన చేనే త కార్మికులకు 163మంది చేనేత కార్మికులకు1.15 కోట్లు రూపాయ లు విడుదల చేయడం జరిగింది.

## ఈ నెల 13 నుండి 18వ తేదీ వర కు కొనసాగనున్న అరైవ్-అలైవ్ కార్యక్రమాలను జిల్లాలో సమిష్టి కృషి తో పనిచేసి విజయవంతం చేయాలి జిల్లా ఎస్పీఅక్షాంక్ష్.

**జిల్లా ఎస్పీఅక్షాంక్ష్.**





యాదాద్రి భువనగిరి. తేహెల్కా న్యూస్: పోలీస్ ఏ ఆర్ హెడ్ క్వాటర్స్ అరైవ్ ఉ అలైవ్ కార్యక్రమాల పై జిల్లా ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్, స్థానిక సంస్థ ల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు,అడిషనల్ ఎస్పీ లక్ష్మీనారాయణ,సంబంధిత శాఖ ల అధికారులతో సమీక్ష నిర్వహిం చారు. ఈసందర్బంగా ఎస్పీ మాట్లడుతూ రోడ్డు ప్రమాదాల పట్ల ప్రజల్లో చైత న్యాన్ని పెంపొందించేందుకు వీలు గా చేపట్టిన అరైవ్ఉఅలైవ్ కార్యక్ర మాన్ని పూర్తి స్థాయిలో విజయ వంతం చేయాల్సిన బాధ్యత అధి కారులపై ఎంతైనా ఉందని సూ చించారు.వార్డు సభ్యులు,సర్పం చ్ లు,కౌన్సిలర్లు సహా స్థానికసంస్థ ల ప్రజాప్రతినిధులను,అన్ని వర్గా ల వారిని భాగస్వాములు చేయా లని అన్నారు.13వ తేదీన అన్ని గ్రామ పంచాయతీలలో సర్పంచ్ ల అధ్యక్షతన గ్రామ సభలు నిర్వహించాలని,రోడ్డు ప్రమాదాల నివా రణకు కృషి చేస్తామని ప్రజలతో ప్రతిజ్ఞ చేయించాలని సూచించా రు. అదేవిధంగా రిటైర్డ్ టీచర్లు,డాక్టర్లు అంగన్వాడీ,ఆశా వర్కర్లు,ప్రభుత్వ ఉద్యోగులు,యువజనసంఘా ల ప్రతినిధులతో కూడిన రోడ్ సేఫ్టీ కమిటీని ఏర్పాటు చేసుకోవాలని, ఈ కమిటీలో కనీసం ముగ్గురు మహిళలకు ప్రాతినిధ్యం ఉండేలా చూడాలని అన్నారు. ఎక్కడైనా రోడ్ల పక్కన గుంతలు,పాడుబడిన బావులు ఉంటే పూడ్చివేయించా లని,ముళ్ళ పొదలు,పిచ్చి మొక్క లను తొలగించాలని సూచించారు 14వ తేదీన భారత రాజ్యాంగ ని ర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబే ద్కర్ జయంతి కార్యక్రమాల సంద ర్భంగా రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రతిజ్ఞ చేయించాలని తెలిపారు

## నూతన పాగింగ్ యంత్రాలను ప్రారంభించిన -- ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి.



ఎల్.బి.నగర్,ఏప్రిల్ 10,తేహల్కా ప్రతినిధిమురళీమోహన్ గౌడ్. ఎల్బీనగర్ మున్సిపల్ కార్యాలయంలో నూతన పాగింగ్ యంత్రాలను ప్రారంభించిన ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి.ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా నియోజకవర్గ ప్రజలు దోమల వల్ల అనేక ఇబ్బందులు గురవుతున్నారు అని గుర్తించి దోమలపై యుద్ధం అనే నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది.దానిలో భాగంగా నా పిలుపు మేరకు నా యొక్క అభిమానులు తమ,తమ స్వంత నిధులతో ఫాగింగ్ యంత్రాలు కొనుగోలు చేసి నియోజకవర్గ పరిధిలో పలు ప్రాంతాల్లో సాయంత్రం పూట ఫాగింగ్ చేయడం జరుగుతుంది అని తెలిపారు. గత భారస ప్రభుత్వంలో కేటీఆర్ సూచనల మేరకు ప్రజ సమస్యల మీద ఎంతో చిత్తశుద్ధితో ముందుచూపుతో ఆలోచించి నియోజకవర్గ పరిధిలోని చెరువుల్లో గుఱ్ఱపుడెక్క ఆకు పేరుకొనిపోకుండా కాలనీవాసుల సౌలభ్యం కోసం దోమల నివారణకు డ్రోన్స్ సహాయంతో ప్రయోగాత్మకంగా పరీక్షలు నిర్వహించి సఫలీకృతం కావడం జరిగింది.అలాగే చెరువుల్లో దోమల వల్ల ఉత్పన్నం అయ్యే లార్వాను అరికట్టడానికి వందలాది గంబూజియా జాతికి చెందిన చేప పిల్లలను చెరువులోకి వదిలి లార్వాను మింగేయడం జరిగింది.అలాగే డ్రోన్ పరిజ్ఞానం ఉపయోగించి చెరువు మధ్యలోకి వెళ్లడం సాధ్యం కాని చోట్ల కూడా దోమల నివారణకు మందులు చల్లడం జరిగింది అని గుర్తు చేశారు.కానీ ప్రస్తుతం ఇట్టి ప్రభుత్వం ప్రజా ఆరోగ్యాల మీద దృష్టి పెట్టకుండా చెరువుల్లో పెరుకుపోతున్న గుఱ్ఱపుడెక్క ఆకును తొలగించకుండా నిమ్మకు నీరెత్తినట్లు చోద్యం చూస్తుంది.ప్రజలు విష జ్వరాలతో బాధపడుతున్న హులుకులేదు పలుకులేదని అన్నారు.ప్రస్తుతం ఉదయం మరియు సాయంత్రం పూట వాకింగ్ కోసం రావాలంటే దోమల దండయాత్ర వల్ల ఎక్కడ మలేరియా,డెంగీ జ్వరాలు వస్తాయో అని ప్రజలు భయపడుతున్నారు అని అన్నారు.అలాగే నోరు తెరిస్తే నోట్లోకి దోమలు పోతున్నాయి అని అన్నారు.ఇప్పటికి కూడా ఆయిల్ బాల్స్ మరియు గంబుజియా చేపల ప్రస్తావన ఎక్కడ లేకుండా ఇట్టి ప్రభుత్వం నిమ్మకు నిరేత్తినట్టు వ్యవహరిస్తుందని అన్నారు.గత కొన్ని రోజులుగా సుధీర్ రెడ్డి దోమలపై యుద్ధం కార్యక్రమం చేయడం వల్ల ఇట్టి ప్రభుత్వంలో చలనం వచ్చి డివిజన్ కు ఒక్కో ఫాగింగ్ యంత్రం కేటాయించడం జరిగిందన్నారు.ఇదంతా సుధీర్ రెడ్డి చేసిన పోరాట పటిమ వల్లే సాధ్యమైందని ప్రజలందరూ సంతోషిస్తున్నారు.ఇట్టి కార్యక్రమంలో జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ మరియు పలువురు డిప్యూటీ కమీషనర్లు,ఎంటమాలజీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మూలరామ పూజల్లో పాల్గొన్న శ్రీ మఠం పీఠాధిపతులు..... శ్రీ సుబుదేంద్ర తీర్థ స్వామీజీ.



సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి మఠంపీఠాధిపతులు శ్రీ సుబుదేంద్ర తీర్థ స్వామీజీ సంస్థాన పూజల్లో భాగంగా పూర్ణ బోధ మండపంలో బ్రహ్మకర్చిత మూలరాముల విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి కర్పూర హారతులు సమర్పించారు. అనంతరం శ్రీమఠం ప్రాకారంలో భక్తులకు ఫలమంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు.

## జై మీమ్ ఉ జై భీమ్ నినాదాలతో ర్యాలీని విజయవం తంచేసి.అంబే ద్కర్ జయంతి ఘనంగా నిర్వహించాలి. బర్రె జహంగీర్.





యాదాద్రి భువనగిరి. తేహెల్కా న్యూస్:మహనీయుల జయంతి ఉత్సవా లను కుల,మత భేదాలకు అతీతంగా ఘనంగా నిర్వహించాలని మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్ పిలుపునిచ్చారు. ఏప్రిల్ 14న జరగనున్న భారత రాజ్యాం గ నిర్మాత డా.బాబా సాహెబ్ అం బేద్కర్ జయంతిని విజయవంతం చేయాలని ఆయన కోరారు.శుక్రవారం భువనగిరి పట్టణంలోని వివిధ మసీదులో నమాజ్ అనం తరం భువనగిరి పట్టణంలోని ప లు మసీదులను సందర్శించిన బర్రె జహంగీర్,ముస్లిం మైనారిటీ సోదరులతో ప్రత్యక్షంగా సమావేశ మై పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడు తూ... ఈ నెల 12న నిర్వహించనున్న మైనారిటీ సమావేశాన్ని విజయ వంతం చేయాలని సూచించారు.అదేవిధంగా,ఏప్రిల్14న నిర్వహిం చే అంబేద్కర్ ర్యాలీలో ముస్లిం మైనారిటీలు భారీగా పాల్గొని జై మీమ్-జై భీమ్ నినాదాలతో విజ యవంతం చేయాలని కోరారు. సమాజంలో పెరుగుతున్న మతత త్వ వాదాన్ని కట్టడి చేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొ న్నారు.ఈ కార్యక్రమంలో ఇలియాస్ భా య్,ఎం.డి భురానుద్దీన్ కౌన్సిల ర్,నాఖ బబ్లు,ముస్లిం మైనార్టీనాయ కులు అనీఫ్ మైమన్,ఇక్బాల్ చౌ దరి,ఎండి సుజాయిద్దీన్,షేక్ హ మీద్ పాష,గఫూర్ బాయ్,ఖాజాం అమీర్ బాయ్, బండార్ రవివర్ధన్ బీరప్ప నరసింహ మాజీ కౌన్సిలర్ ఇటికల దేవేందర్,కుతాడి సురేష్, నాగారం శంకర్,మంద శివ,పులిగి ల్ల బాలయ్య,ఐలాపురం బాబు, ఎండి భారీ,ఎండి అమానతుల్లా, ఎడబోయిన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి టీచర్లకు స్మార్ట్ ఫోన్ పంపిణీ. పాల్గొన్న ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి.





యాదాద్రి భువనగిరి. తేహెల్కా న్యూస్:భువనగిరి నియోజకవర్గానికి సం బంధించిన అంగన్వాడి టీచర్లకు స్మార్ట్ ఫోన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కుంభశీ అనిల్ కుమార్ రెడ్డి భువనగిరి మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవి కుమార్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ అంగన్వాడీ టీచర్లకు ఈ స్మార్ట్ ఫోన్ ఎంతో ఉపయోగపడుతుందని. అన్ని రకాలుగా బయోడేటాను ఈ ఫోన్లో స్టోర్ చేసుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు, అంగన్వాడి టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

# పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో సీఈఐఆర్ టెక్నాలజీతో

# 23 మొబైల్ ఫోన్ల రికవరీ - యజమానులకు అందజేత





**తెహెల్కా రంగారెడ్డి జిల్లా ఏప్రిల్ 10 ప్రతినిధి ఈ.పద్మారావు కాపు:** కేంద్ర ప్రభుత్వానికి చెందిన సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (జజు×=) సాంకేతికతను సమర్థవంతంగా వినియోగిస్తూ పహాడీషరీఫ్ పోలీసులు వివిధ ప్రాంతాలలో పోయిన మొత్తం 23 మొబైల్ ఫోన్లను విజయవంతంగా రికవరీ చేశారు.ఈ సందర్భంగా పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రికవరీ చేసిన మొబైల్ ఫోన్లను వారి అసలు యజమానులకు పోలీసు అధికారుల సమక్షంలో అందజేశారు.తమ ఫోన్లు పోగొట్టుకున్న బాధితులు ఫిర్యాదు చేసిన వెంటనే స్పందించి సాంకేతిక పరిజ్ఞానంతో వాటిని వెతికి పట్టుకున్న పోలీసుల సేవలను అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు.ప్రజా సమస్యల పరిష్కారంలో ఆధునిక సాంకేతికతను వినియోగించి విశేష ప్రతిభ కనబరిచిన పహాడీషరీఫ్ ఇన్‌స్పెక్టర్ బి.లక్ష్మీ నారాయణ రెడ్డి,సబ్-ఇన్‌స్పెక్టర్లు మరియు క్రైమ్ టీంను రాజేంద్రనగర్ డివిజన్ ఏసీపీ మరియు శంషాబాద్ జోన్ డీసీపీ ప్రత్యేకంగా అభినందించారు.పోలీస్ శాఖ తీసుకుంటున్న ఈ విధమైన చర్యలు ప్రజల ఫిర్యాదులపై వేగవంతమైన స్పందనకు,ఆధునిక సాంకేతికత వినియోగానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి.మొబైల్ ఫోన్లు పోయినా లేదా దొంగతనానికి గురైనా ప్రజలు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని,అలాగే తమ పరికరాలను బ్లాక్ చేయడం మరియు ట్రేస్ చేయడం కోసం సీఈఐఆర్ సేవలను వినియోగించుకోవాలని పోలీసులు సూచించారు.ప్రజల సేవలో పహాడీషరీఫ్ పోలీసులు ఎల్లప్పుడూ ముందుంటారని,సురక్షిత సమాజ నిర్మాణంలో ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.



తెలంగాణ రాష్ట్రానికి కొత్త పూర్తిస్థాయి డీజీపీ నియామక

# తెలంగాణ కొత్త డీజీపీగా సి.వి. ఆనంద్..

# త్వరలోనే అధికారిక ఉత్తర్వులు!

ప్రక్రియ తుది దశకు చేరుకుంది. ప్రస్తుతం ఇన్‌చార్జ్ డీజీపీగా ఉన్న బి. శివధర్ రెడ్డి ఈ నెల 31న పదవీ విరమణ చేయనుండటంతో, 1991 బ్యాచ్ ఐపీఎస్ అధికారి సి.వి. ఆనంద్ తదుపరి డీజీపీగా బాధ్యతలు చేపట్టే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ఖూాజ సిఫార్సు చేసిన ముగ్గురు అధికారుల ప్యానెల్‌లో సి.వి. ఆనంద్, వినాయక ప్రభాకర్ ఆప్టే, సౌమ్య మిశ్రాల పేర్లు ఉన్నాయి. సీనియారిటీ, రాష్ట్రంలో సుదీర్ఘ అనుభవం దృష్ట్యా సి.వి. ఆనంద్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాధాన్యత ఇస్తున్నట్లు సమాచారం. ఈ నెల 14వ తేదీ తర్వాత అధికారిక ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది.

# ఎల్లుండి ఇంటర్ ఫలితాలు.. ఇలా చెక్ చేసుకోండి..!

తెలంగాణ ఇంటర్మీడియట్ ఫలితాల విడుదలపై నెలకొన్న ఉత్కంఠకు తెరపడనుంది. తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం, రాష్ట్ర విద్యాశాఖ ఏప్రిల్ 12న (ఆదివారం) ఫలితాలను వెల్లడించేందుకు రంగం సిద్ధం చేసినప్పటికీ, పలు జాతీయ స్థాయి నివేదికల ప్రకారం ఒక రోజు ముందే అంటే ఏప్రిల్ 11న శనివారం కూడా ఫలితాలు వచ్చే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది.

ఈ ఏడాది ఫిబ్రవరి 26 నుంచి మార్చి 18 వరకు జరిగిన వార్షిక పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 9.9 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. ప్రథమ , ద్వితీయ సంవత్సరాల ఫలితాలను ఒకేసారి విడుదల చేసేందుకు బోర్డు అన్ని కసరత్తులు పూర్తి చేసింది. విద్యార్థులు తమ ఫలితాలను విడుదలైన వెంటనే అధికారిక వెబ్‌సైట్లయి tgbie.cgg.gov.in .results.cgg.gov.in లలో హాల్ టికెట్ నంబర్‌ను నమోదు చేసి మార్కుల మెమోను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

గత కొన్నేళ్లుగా ఫలితాల ప్రక్రియను బోర్డు మరింత వేగవంతం చేస్తోంది. పేపర్ వాల్యుయేషన్ ముగిసిన వెంటనే సాంకేతిక పరమైన మార్కుల క్రోడీకరణ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయడంతో, నిర్ణీత గడువు కంటే ముందే ఫలితాలు వెలువడనున్నాయి. ముఖ్యంగా ఆదివారం ఫలితాలు విడుదల చేయడం వల్ల విద్యార్థులు, తల్లిదండ్రులు సెలవు దినం రోజున ఒత్తిడి లేకుండా ఫలితాలు చూసుకునే అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. ఈ రిజల్ట్స్ ఆధారంగానే విద్యార్థులు ఎంసెట్, నీట్ వంటి జాతీయ స్థాయి పోటీ పరీక్షలతో పాటు ఉన్నత చదువులకు సిద్ధం కానున్నారు. ఫలితాల అనంతరం మార్కులతో సంతృప్తి చెందని విద్యార్థుల కోసం రీ-కౌంటింగ్ , రీ-వెరిఫికేషన్ ప్రక్రియలు కూడా అందుబాటులో ఉంటాయి. అపజయానికి లోనైన విద్యార్థుల కోసం త్వరలోనే అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల షెడ్యూల్‌ను కూడా బోర్డు ప్రకటించనుంది.

# అత్యధిక బంగారం ఏ దేశం వద్ద ఉంది?

# భారత్ ఏ స్థానంలో? టాప్ -5 దేశాలు ఇవే!

అత్యధిక బంగారం ఏ దేశం వద్ద ఉంది. ప్రపంచంలో ఏ దేశంలో అత్యధిక బంగారం ఉందో మీకు తెలుసా? బంగారం విషయంలో భారతదేశం ఏ స్థానంలో ఉంది. ఎన్ని టన్నుల బంగారాన్ని కలిగి ఉంది? పూర్తి వివరాలు తెలుసుకుందాం.. అవసరమైనప్పుడు బంగారం ఒక ఆశాకిరణం. అది కుటుంబమైనా, దేశమైనా, ప్రతి ఒక్కరూ బంగారం కొనడానికి ఆసక్తి చూపుతారు. కానీ ప్రపంచంలో ఏ దేశంలో అత్యధిక బంగారం ఉందో మీకు తెలుసా? భారతదేశంలో ఎంత బంగారం ఉంది? చైనాలో ఎంత బంగారం ఉంది? పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లలో ఎంత బంగారం ఉంది? మరి గత కొన్ని నెలల్లో ఏ దేశం అత్యధికంగా బంగారం కొనుగోలు చేసింది? ఆసక్తికర విషయాలు తెలుసుకుందాం..ప్రపంచ బంగారు నిల్వలు ఒక దేశ ఆర్థిక బలాన్ని ప్రతిబింబిస్తాయి. 2026 గణాంకాల ప్రకారం.. కొన్ని దేశాలు ద్రవ్యోల్బణం, భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నుండి రక్షించుకోవడానికి తమ బంగారు నిల్వలను గణనీయంగా పెంచుకున్నాయి.భారతదేశంలో టాప్ ఎలక్ట్రిక్ స్కూటర్లు.. బెస్ట్ మైలేజీ..!అమెరికా వద్ద అత్యధిక బంగారం: ఇప్పుడు ప్రపంచంలో ఏ దేశం వద్ద అత్యధిక బంగారం ఉందో తెలుసుకుందాం. ప్రపంచంలోనే అతిపెద్దదైన 8,133 టన్నుల బంగారు నిల్వలు యునైటెడ్ స్టేట్స్ వద్ద ఉన్నాయి. ఈ నిల్వ ప్రధానంగా ఫోర్ట్ నాక్స్‌లో ఉంది.యూరప్‌లో జర్మనీ : సుమారు 3,350 టన్నుల బంగారు నిల్వలతో రెండవ అతిపెద్ద దేశంగా నిలిచింది జర్మనీ. 2,452 టన్నులతో ఇటలీ మూడవ స్థానంలో ఉంది. ఫ్రాన్స్‌లో సుమారు 2,437 టన్నుల బంగారం ఉంది. చైనా కూడా భారీ పరిమాణంలో బంగారాన్ని కొనుగోలు: బంగారు నిల్వలలో రష్యా ఐదవ స్థానంలో ఉంది. ప్రస్తుతం, రష్యా వద్ద సుమారు 2,330 టన్నుల బంగారం ఉంది. దీని అర్థం చైనా ఇంకా మొదటి 5 దేశాలలో లేదని. అయితే, గత కొన్ని సంవత్సరాలుగా చైనా తన బంగారు నిల్వలను క్రమంగా పెంచుకుంటూ వస్తోంది. ప్రస్తుతం చైనా వద్ద సుమారు 2,313.5 టన్నుల బంగారం ఉంది. గత 17 నెలలుగా చైనా తన నిల్వలను స్థిరంగా పెంచుకుంటూ వస్తోంది. చైనా ఇదే వేగంతో కొనుగోలు కొనసాగిస్తే, అది త్వరలోనే మొదటి 5 దేశాలలో చేరవచ్చు.2026లో భారతదేశపు బంగారు: నిల్వలు కొత్త శిఖరాలను చేరుకుంటాయని అంచనా. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) వద్ద సుమారు 880 టన్నుల బంగారం ఉంది. తన విదేశీ మారక నిల్వలను వైవిధ్యపరచుకోవడానికి భారతదేశం నిరంతరం బంగారాన్ని కొనుగోలు చేస్తోంది. ప్రభుత్వ స్థాయిలో మాత్రమే కాకుండా ప్రైవేట్ రంగంలో కూడా,



ప్రపంచంలోనే బంగారాన్ని అత్యధికంగా వినియోగించే దేశాలలో భారతదేశం ఒకటి.భారతదేశం కూడా భారీగా బంగారం కొనుగోలు చేస్తోంది: వాస్తవానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) తన కొనుగోళ్లను వేగవంతం చేసింది. 2026 ఫిబ్రవరిలో భారతదేశం సుమారు 18 టన్నుల బంగారాన్ని కొనుగోలు చేసింది. అమెరికా డాలర్‌పై ఆధారపడటాన్ని తగ్గించుకోవడానికి, తన పోర్ట్‌ఫోలియోను కాపాడుకోవడానికి భారతదేశం గత కొన్ని నెలలుగా నిరంతరం బంగారాన్ని కొనుగోలు చేస్తోంది. భారతదేశం, చైనా, రష్యా వంటి దేశాలు డాలర్ ప్రభావాన్ని తగ్గించడానికి బంగారాన్ని ఒక ఆచరణీయమైన ప్రత్యామ్నాయంగా చూస్తున్నాయి. పాకిస్తాన్ వద్ద ఇంతే బంగారం ఉంది: పాకిస్తాన్ వద్ద చాలా పరిమితమైన బంగారు నిల్వలు ఉన్నాయి. ఆ దేశం ఇప్పటికే తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో ఉంది. ప్రస్తుతం, పాకిస్తాన్ వద్ద సుమారు 64.77 టన్నుల బంగారం ఉంది. ఇది భారతదేశం కంటే గణనీయంగా తక్కువ. బంగ్లాదేశ్ వద్ద కేవలం సుమారు 14.28 టన్నుల బంగారం మాత్రమే ఉంది.

బంగారం కొనుగోళ్లలో పోలాండ్ అగ్రస్థానం: 2026 (ఫిబ్రవరి-మార్చి 2026) ప్రాథమిక సమాచారం ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా ఉన్న కేంద్ర బ్యాంకులు బంగారం కొనుగోలు చేయడానికి పోటీ పడుతున్నాయి. గత ఒకటి రెండు నెలల్లో అత్యధికంగా బంగారం కొనుగోలు చేసిన దేశాల జాబితాలో పోలాండ్ అగ్రస్థానంలో ఉంది. ఫిబ్రవరి 2026లో పోలాండ్ కేంద్ర బ్యాంకు ఒక్కటే 20 టన్నుల బంగారాన్ని కొనుగోలు చేసింది. పోలాండ్ తన మొత్తం విదేశీ మారక నిల్వల్లో 20 శాతాన్ని బంగారంగా మార్చుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఉజ్బెకిస్తాన్: ఫిబ్రవరి-మార్చి నెలల్లో తన నిల్వలకు దాదాపు 8 టన్నుల బంగారాన్ని జమ చేసింది. ఇది వరుసగా ఐదు నెలలుగా నికర బంగారు కొనుగోలుదారుగా ఉంది. కజకిస్తాన్ కూడా ఇటీవల తన కార్యకలాపాలను పెంచుకుని, గత నెలలో దాదాపు 8 టన్నుల బంగారాన్ని కొనుగోలు చేసింది.

# పరీక్షలలో నిర్లక్ష్యం సమయం పూర్తికాక

# ముందే విద్యార్థులను పంపించిన ప్రిన్సిపాల్




**తెహెల్కా రంగారెడ్డి జిల్లా ఏప్రిల్ 10 ప్రతినిధి ఈ.పద్మారావు కాపు:** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్లో ప్రిన్సిపాల్ నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఘటన వెలుగులోకి వచ్చింది.ఏప్రిల్ 8వ తేదీ నుండి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు సమ్మేటివ్-2 వార్షిక పరీక్షలు జరుగుతున్న విషయం తెలిసిందే.విద్యాశాఖ డైరెక్టర్ & కమిషనర్ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం 6వ,7వ తరగతులకు ఉదయం 9 గంటల నుండి 11.30 గంటల వరకు,8వ తరగతికి 9 గంటల నుండి 11.45 గంటల వరకు, 9వ తరగతికి 9 గంటల నుండి 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించాలి.అనంతరం మధ్యాహ్న భోజనం తర్వాత విద్యార్థులను ఇంటికి పంపించాలని నిబంధనలు ఉన్నాయి.అయితే ఏప్రిల్ 10వ తేదీన ఇంగ్లీష్ పరీక్ష రోజు మహేశ్వరం మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఇ. గోపి పరీక్ష సమయం పూర్తికాకముందే ఉదయం 11 గంటల నుండి 11.30 గంటల మధ్యలోనే అన్ని తరగతుల విద్యార్థుల జవాబు పత్రాలను సేకరించినట్లు ఆరోపణలు ఉన్నాయి.అనంతరం సుమారు 11.45 గంటల సమయంలో అసెంబ్లీ నిర్వహించి,మధ్యాహ్న భోజనం చేసిన వెంటనే సుమారు 12 గంటల ప్రాంతంలో విద్యార్థులను ఇంటికి పంపించినట్లు సమాచారం.అలాగే ఉపాధ్యాయులు కూడా ముందుగానే పాఠశాల నుంచి వెళ్లిపోయినట్లు తెలుస్తోంది.పరీక్ష సమయం ముగియకముందే పేపర్లు తీసుకోవడం వల్ల తమకు అన్యాయం జరిగిందని కొందరు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పాఠశాలలో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజ్ మరియు ఎఫ్ఆర్ఎస్ (ముఖ గుర్తింపు) హాజరు రికార్డులను పరిశీలిస్తే నిజ పరిస్థితులు బయటపడతాయని పేర్కొంటున్నారు.ఈ ఘటనపై సంబంధిత అధికారులు వెంటనే విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు మరియు తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.గతంలో కూడా పరీక్షల నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగా చర్యలు తీసుకున్నప్పటికీ,ప్రిన్సిపాల్ వ్యవహారంలో మార్పు లేకపోవడం ఆశ్చర్యకరంగా ఉందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# అతి గతి లేని పెన్షన్ - పడిగపులతో పెన్షన్

# దారుల ఆవేదన-కర్రెడ్ల నరేందర్ రెడ్డి



**తెహెల్కా రంగారెడ్డి జిల్లా ఏప్రిల్ 10 ప్రతినిధి ఈ.పద్మారావు కాపు:** జిల్లాలో ఇప్పటివరకు పలువురు అర్హులైన పెన్షన్ దారులకు పెన్షన్ అందకపోవడంతో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది.ఈ సందర్భంగా కర్రెడ్ల నరేందర్ రెడ్డి మాట్లాడుతూ,ప్రభుత్వం పెన్షన్ దారులను తప్పుదోవ పట్టిస్తోందని ఆరోపించారు.

రైతులకు రైతుబంధు కింద కేవలం రూ.6000 మాత్రమే అందజేస్తూ,ఇటు రైతులను మరియు అటు పెన్షన్ దారులను రెండింటిని మోసం చేస్తున్నారని విమర్శించారు.పెన్షన్ నిధులను రైతులకు మళ్లించడం వల్ల అసలు అర్హులైన పెన్షన్ దారులు నష్టపోతున్నారని అన్నారు.మాటలతో స్వర్గాన్ని చూపిస్తూ,వాస్తవంలో ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న ఈ కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే రాజీనామా చేయాలని కోరారు.పెన్షన్ సమస్యను తక్షణమే పరిష్కరించి,అర్హులందరికీ న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# అంబేద్కర్ చౌరస్తాలో పూలే జయంతి

# కార్యక్రమం - కాంగ్రెస్ నేతల ఆహ్వానం కాకి

# ఈశ్వర్ ముదిరాజ్



**తెహెల్కా రంగారెడ్డి జిల్లా ఏప్రిల్ 10 ప్రతినిధి ఈ.పద్మారావు కాపు:** మహాత్మ జ్యోతిరావు పూలే 200వ జయంతి సందర్భంగా మహేశ్వరం నియోజకవర్గ కేంద్రంలో ఘన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాకి ఈశ్వర్ ముదిరాజ్ తెలిపారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ సమీపంలోని అంబేద్కర్ చౌరస్తాలో మహాత్మ పూలే గారికి ఘన నివాళులు అర్పించనున్నట్లు చెప్పారు.ఈ కార్యక్రమానికి మహేశ్వరం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్,వైస్ చైర్మన్,డైరెక్టర్లు,ఆలయ కమిటీ ప్రతినిధులు,మాజీ మరియు ప్రస్తుత ప్రజాప్రతినిధులు,ఇందిరమ్మ కమిటీ సభ్యులు, విద్యా కమిటీ సభ్యులు,కాంగ్రెస్ సమన్వయ కమిటీ సభ్యులు,అనుబంధ సంఘాల నాయకులు (బీసీ,ఎస్సీ,ఎస్టీ,మైనార్టీ,మహిళ, యువజన,ఎన్ఎస్ యుఐ,సోషల్ మీడియా) మరియు గ్రామ శాఖ అధ్యక్షులు పాల్గొనాలని కోరారు.నేడే శనివారం ఉదయం 10 గంటలకు సకాలంలో విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కాకి ఈశ్వర్ ముదిరాజ్ విజ్ఞప్తి చేశారు.

# భాగ్యనగరంలో 'ప్రేమ' ముసుగులో మతం

# మార్పిడి దందా: అన్నదమ్ముల ఘాతుకం

హైదరాబాద్‌లోని పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో హిందూ యువతులను లక్ష్యంగా చేసుకుని సాగుతున్న ఒక దారుణమైన వంచన ఉదంతం నగరంలో తీవ్ర కలకలం రేపుతోంది. ప్రేమ పేరుతో వల వేయడం, ఆపై మతం మార్చుకోవాలంటూ తీవ్రస్థాయిలో వేధింపులకు గురిచేస్తున్న ఇద్దరు అన్నదమ్ముల వ్యవహారం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. జమీర్, అతని తమ్ముడు మిరాజ్ కలిసి ఒక పక్కా ప్రణాళికతో అమాయక యువతులను ట్రాప్ చేస్తున్నట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ఈ అన్నదమ్ములు ఇద్దరూ ఇప్పటివరకు సుమారు ఐదుగురు హిందూ యువతులను ప్రేమ పేరుతో నమ్మించి, వారి జీవితాలతో ఆడుకున్నట్లు తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి.నిందితుల్లో ఒకరైన జమీర్‌పై గతంలోనే పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో పోక్సో చట్టం కింద కేసు నమోదై ఉండటం గమనార్హం. ఒక మైనర్ బాలికను వేధించిన కేసులో జైలుకు వెళ్లి వచ్చినా, అతని ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాలేదని పోలీసులు గుర్తించారు. జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత జమీర్ తన తమ్ముడు మిరాజ్‌తో కలిసి ఈ అరాచకాలను మరింత ముమ్మరం చేశాడు. తాజాగా మరో యువతిని తన ప్రేమ వలలో వేసుకున్న జమీర్, ఆమెను లొంగదీసుకున్న తర్వాత అసలు స్వరూపాన్ని బయటపెట్టాడు. సదరు యువతిపై అఘాయిత్యానికి పాల్పడటమే కాకుండా, ఆమెను తమ మతంలోకి మారాలని బలవంతం చేస్తూ తీవ్రమైన ఒత్తిడికి గురిచేశాడు. ఒకవేళ ఈ విషయాన్ని ఎవరికైనా చెబితే ప్రాణాలు తీస్తామంటూ అన్నదమ్ములిద్దరూ కలిసి బాధితురాలిని బ్లాక్ మెయిలింగ్ చేసినట్లు సమాచారం.బాధితురాలు ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయడంతో ఈ అన్నదమ్ముల గుట్టు రట్టయింది. రంగంలోకి దిగిన పంజాగుట్ట పోలీసులు నిందితులపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ అన్నదమ్ములు కేవలం ఇద్దరే ఇలాంటి అక్రమాలకు పాల్పడుతున్నారా లేక వీరి వెనుక ఏదైనా పెద్ద ముఠా ఉందా అనే కోణంలో పోలీసులు లోతుగా ఆరా తీస్తున్నారు. బాధితుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉండటంతో, నిందితుల నుంచి ప్రాణహాని ఉన్న యువతులకు రక్షణ కల్పించేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. నగర నడిబొడ్డున మతం మార్పిడి లక్ష్యంగా జరుగుతున్న ఇటువంటి దాడులు స్థానిక ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి.

# బంగారం ధరలు

| | | |
|---|---|---|
| హైదరాబాద్ | ₹13,85,000 | ₹15,08,100 |
| ముంబయి | ₹13,81,000 | ₹15,06,600 |
| న్యూఢిల్లీ | ₹13,82,500 | ₹15,08,100 |



## : ఇరాన్‌లో కిలో బియ్యం మరీ ఇంత రేటా..?

## ధర ఎంతో తెలిస్తే కళ్లు బైర్లు కమ్మాల్సిందే



పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు ఇరాన్ సామాన్య ప్రజల నడ్డి విరుస్తున్నాయి. యుద్ధ భయం ఒకవైపు వెంటాడుతుంటే, మరోవైపు దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. ఆర్థిక ఆంక్షలు, అంతర్గత సంక్షోభాల మధ్య ఇరాన్ కరెన్సీ విలువ దారుణంగా పడిపోవడంతో, సామాన్యులు ఒక పూట భోజనం..

ఇరాన్, అమెరికా, ఇజ్రాయెల్ మధ్య ఘర్షణ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో, ఇరాన్ మార్కెట్లు అతలాకుతలం అవుతున్నాయి. అంతర్జాతీయ ఆంక్షల వల్ల ఇప్పటికే బలహీనపడిన ఇరాన్ ఆర్థిక వ్యవస్థ, తాజా యుద్ధ పరిణామాలతో మరింత దిగజారింది. స్థానిక కరెన్సీ 'రియాల్' విలువ పతనం కావడంతో ద్రవ్యోల్బణం విపరీతంగా పెరిగిపోయింది. దీనివల్ల సామాన్య పౌరులు తమ ప్రాథమిక అవసరాలను తీర్చుకోవడానికి నానా అవస్థలు పడుతున్నారు. అక్కడి మార్కెట్లలో నిత్యావసర వస్తువుల ధరలు సామాన్యులకు అందనంత ఎత్తుకు చేరుకున్నాయి. తాజా గణాంకాల ప్రకారం..

బియ్యం: అక్కడ ఒక కిలో బియ్యం ధర భారతీయ కరెన్సీలో సుమారు రూ. 600 నుంచి రూ. 800 వరకు పలుకుతోంది.

మాంసం: మాంసం ధరలు కిలోకు రూ. 4000 దాటిపోయాయి, ఇది మధ్యతరగతి కుటుంబాలకు తీరని భారంగా మారింది. ఇతర వస్తువులు: పాలు, గుడ్లు, కూరగాయల ధరలు కూడా గత కొన్ని వారాల్లో రెట్టింపు అయ్యాయి. హోటళ్లు, తినుబండారాల కేంద్రాల్లో ధరలు పెరగడంతో జనం బయట తినడమే మానేస్తున్నారు. ధరల పెరుగుదల వల్ల ఇరాన్ ప్రజల కొనుగోలు శక్తి గణనీయంగా తగ్గింది. ప్రజలు తమ పొదుపు మొత్తాన్ని కేవలం ఆహారం కోసమే ఖర్చు చేయాల్సి వస్తోంది. నిరుద్యోగం పెరగడం, జీతాలు పెరగకపోవడం, ధరలు ఆకాశాన్ని తాకడంతో మధ్యతరగతి ప్రజలు పేదరికంలోకి జారుకుంటున్నారు. యుద్ధం వల్ల ప్రజలు వస్తువులను నిల్వ చేసుకోవడం కూడా కొరతకు, తద్వారా ధరల పెరుగుదలకు కారణమవుతోంది. కాగా, యుద్ధం ఏ దేశానికైనా విధ్వంసాన్నే మిగుల్చుతుంది అనడానికి ఇరాన్ ప్రస్తుత పరిస్థితి ఒక నిదర్శనం. ఆయుధాల మోత కన్నా ఆకలి కేకలు అక్కడ భయంకరంగా వినిపిస్తున్నాయి.

# వ్యాపారం

## హర్మూజ్ నుంచి భారత్‌కు షిప్ ఎన్ని రోజుల్లో చేరుతుందో

## తెలుసా! ఈ రూట్‌లో డైలీ ఎన్ని వెళ్తాయంటే



ప్రస్తుతం ప్రతి ఒక్కరి చూపు స్ట్రేట్ ఆఫ్ హర్మూజ్ వైపే చూస్తుంది. ఎందుకంటే ఇరాన్- ఇజ్రాయెల్- అమెరికా యుద్ధం కారణంగా ప్రపంచ దేశాల మధ్య రాకపోకలకు కీలకంగా ఉన్న హర్మూజ్ జలసంది మూతబడింది. దీంతో గల్ఫ్ దేశాల నుంచి భారత్‌కు రావాల్సిన చమురు నౌకలు మొదట్లో అక్కడే ఆగిపోయాయి. భారత్ చర్చల తర్వాత ఆ షిప్స్ ఇండియాకు చేరుకున్నాయి. అయితే ఒక చమురు నౌక హ్మరోజ్ నుంచి భారత్ చేరుకోవడానికి ఎంత సమయం పడుతుందో మీకు తెలుసా? ఆ నౌకలకు ఎవరు రక్షణ కల్పిస్తారని మీరు ఎప్పుడైనా ఆలోచించారా? అయితే తెలుసుకుందాం పదండి. స్ట్రేట్ ఆఫ్ హర్మూజ్.. ఇది ప్రపంచ దేశాలకు మధ్య రాకపోకలకు అనువుగా ఉన్న ఏకౌక సముద్రం మార్గం. దీని ద్వారానే భారత్ సహా అనేక దేశాలకు అవసరమైన చమురు, గ్యాస్ సరఫరా అవుతుంది. అయితే ఈ జలసంధి నుండి గుజరాత్‌లోని కాండ్లా ఓడరేవుకు దూరం సుమారు 1,000 కిలోమీటర్లు ఉంటుంది. అలాగే ముంబై పోర్ట్‌కు దాదాపు 1,550 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. అయితే వాతావరణం, లోడ్ , మార్గాన్ని బట్టి ఈ ప్రయాణానికి 2 నుండి 3 రోజులు పట్టవచ్చు కొన్ని సార్లు హర్మూజ్ నుంచి ఒక షిప్ ఇండియాలోని ఈ పోర్ట్‌లకు చేరుకోవడానికి రెండు నుండి మూడు రోజులు సమయం పట్టవచ్చు. ఎందుకంటే ఈ నౌకలు పెద్దవిగా ఉంటాయి కాబట్టి నెమ్మదిగా కదులుతాయి. కానీ అరేబియా సముద్రంలో మాత్రం ఇవి స్థిరమైన వేగంతో ప్రయాణిస్తాయి. అయితే చమురు ట్యాంకర్లు సాధారణంగా గంటకు 24 నుండి 31 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తాయి. అంటే సగటున గంటకు 27.78 కిలోమీటర్ల వేగంతో, ఒక ట్యాంకర్ కాండ్లా పోర్టుకు చేరుకోవడానికి సుమారు 37 గంటలు అంటే దాదాపు ఒకటిన్నర రోజు పడుతుంది. అదే ముంబై పోర్టుకు చేరుకోవడానికి సుమారు 53 గంటలు అంటే రెండు రోజులకు పైగా పడుతుంది.

హోర్మూజ్ జలసంధి ఇరాన్, ఒమన్ దేశాల మధ్య ఉంది. ఇది కేవలం 21-33 21-33 కిలోమీటర్ల వెడల్పు మాత్రమే ఉంటుంది. అయితే అంతర్జాతీయ చట్టాల ప్రకారం నౌకల రాకపోకలు సాగుతున్నప్పటికీ, స్థానికంగా ఆచరణలో ఉత్తర భాగాన్ని ఇరాన్, దక్షిణ భాగాన్ని ఒమన్ పర్యవేక్షిస్తాయి. ఈ జలసంది గుండా వెళ్లే నౌకల భద్రతను ఇరాన్, ఒమన్‌తో పాటు అమెరికాకు చెందిన ఫిఫ్త్ ఫ్లీట్ కూడా పర్యవేక్షిస్తుంది. సాధారణ రోజుల్లో రోజుకు 80-130 నౌకలు ఈ మార్గం గుండా వెళ్తుంటాయి. అయితే ఏవైనా ఉద్రిక్తలు తలెత్తినప్పుడు ఇరాన్ ఈ మార్గాన్ని తన ఆదినంలోకి ఉంచుకోవచ్చు. హోర్మూజ్ జలసంధి భారత ఇంధన భద్రతకు అత్యంత కీలక మార్గం. ఇక్కడ సరఫరా ఆగిపోతే దేశంలో పెట్రోల్ ధరలు పెరగడమే కాకుండా ఆర్థిక వ్యవస్థపై కూడా తీవ్ర ప్రభావం పడుతుంది. ఒకవేళ పరిస్థితి విషమిస్తే, చాబహార్ పోర్ట్ వంటి ప్రత్యామ్నాయ మార్గాలను భారత్ ఉపయోగించుకునే అవకాశం ఉంది.

# క్రీడలు

## ధోనీ అభిమానులకు గుడ్‌న్యూస్..

## రీఎంట్రీ డేట్ ఫిక్స్.. ఎప్పుడంటే?



ఈ ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్ తమ పేలవ ప్రదర్శనను కొనసాగిస్తోంది. గాయం కారణంగా ఎంఎస్ ధోనీ జట్టుకు దూరమవడం ఒక పెద్ద ఎదురుదెబ్బ. ఏప్రిల్ 11న జరిగే మ్యాచ్‌కు కూడా ధోనీ దూరమయ్యే అవకాశం ఉంది. అతని గైర్హాజరీ కారణంగా సీఎస్‌కే వరుసగా మూడు మ్యాచ్‌లు ఓడిపోయింది. డెవాల్డ్ బ్రెవిస్ కూడా గాయం నుంచి కోలుకుంటున్నాడు. ఈ సమయంలో ధోనీ త్వరగా తిరిగి వస్తే జట్టుకు బలం చేకూరుతుంది. ఈ ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్ తమ పాత ఫామ్‌లోకి తిరిగి వస్తుందని ఆశించిన అభిమానులు మరోసారి నిరాశకు గురయ్యారు. గత సీజన్ మాదిరిగానే, ఈ సీజన్‌లో కూడా సీఎస్‌కే నిలకడగా పేలవ ప్రదర్శన చేస్తోంది. దీనికి తోడు, జట్టుకు ప్రాణమైన ఎంఎస్ ధోనీ అందుబాటులో లేకపోవడం కూడా జట్టుకు మరిన్ని ఇబ్బందులను తెచ్చిపెట్టింది. ఈ ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్ తమ పాత ఫామ్‌లోకి తిరిగి వస్తుందని ఆశించిన అభిమానులు మరోసారి నిరాశకు గురయ్యారు. గత సీజన్ మాదిరిగానే, ఈ సీజన్‌లో కూడా సీఎస్‌కే నిలకడగా పేలవ ప్రదర్శన చేస్తోంది. దీనికి తోడు, జట్టుకు ప్రాణమైన ఎంఎస్ ధోనీ అందుబాటులో లేకపోవడం కూడా జట్టుకు మరిన్ని ఇబ్బందులను తెచ్చిపెట్టింది. ఐపీఎల్ కోసం అద్భుతంగా సిద్ధమైన ధోనీ, తొలి మ్యాచ్ నుంచే ఆడాలని ఉత్సాహంగా ఉన్నాడు. కానీ, ప్రాక్టీస్ సమయంలో గాయపడిన ధోనీ ఇంకా జట్టులో చేరలేదు. ప్రస్తుతం పునరావాసంలో కోలుకుంటున్న ధోనీ, ఐపీఎల్ తొలి రెండు వారాల పాటు అందుబాటులో ఉండడని ఫ్రాంచైజీ ప్రకటించింది. ఇప్పుడు, అతని ఫిట్‌నెస్‌కు సంబంధించి ఒక కొత్త సమాచారం వెలువడింది. ఐపీఎల్ కోసం అద్భుతంగా సిద్ధమైన ధోనీ, తొలి మ్యాచ్ నుంచే ఆడాలని ఉత్సాహంగా ఉన్నాడు. కానీ, ప్రాక్టీస్ సమయంలో గాయపడిన ధోనీ ఇంకా జట్టులో చేరలేదు. ప్రస్తుతం పునరావాసంలో కోలుకుంటున్న ధోనీ, ఐపీఎల్ తొలి రెండు వారాల పాటు అందుబాటులో ఉండడని ఫ్రాంచైజీ ప్రకటించింది. ఇప్పుడు, అతని ఫిట్‌నెస్‌కు సంబంధించి ఒక కొత్త సమాచారం వెలువడింది. మీడియా నివేదికల ప్రకారం, ఏప్రిల్ 11, 2026న ఎంఏ చిదంబరం స్టేడియంలో ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరగనున్న స్వదేశీ మ్యాచ్‌కు కూడా ధోనీ దూరమవుతాడు. అయితే, ఏప్రిల్ 14న కోల్‌కతా నైట్ రైడర్స్‌తో జరిగే తదుపరి మ్యాచ్‌లో అతను మైదానంలో ఉంటాడని సమాచారం. అయినప్పటికీ, దీనిపై సీఎస్‌కే యాజమాన్యం ఇంకా ఎలాంటి ప్రకటన చేయలేదు.

## ఎవర్రా మీరంతా.. ఆ లిస్ట్ నుంచి

## కోహ్లీ, రోహిత్‌లనే తీసిపడేశారుగా..!



ఇండియన్ ప్రీమియర్ లీగ్ 19వ సీజన్ మైదానంలో పరుగుల వరద పారిస్తోంది. ముఖ్యంగా ఈసారి సీనియర్ల కంటే యువ ఆటగాళ్లే సిక్సర్లు, ఫోర్లతో విరుచుకుపడుతున్నారు. పరుగుల యంత్రం విరాట్ కోహ్లీ వంటి దిగ్గజాలే ఫోర్ల జాబితాలో వెనుకబడిపోవడం గమనార్హం. ప్రస్తుతం సిక్సర్లు, ఫోర్ల వేటలో అగ్రస్థానంలో ఉన్న ఆటగాళ్ల వివరాలు ఓసారి చూద్దాం..ఈ సీజన్ లో సిక్సర్ల పరంగా అద్భుతమైన పోటీ నెలకొంది. ఇప్పటివరకు జరిగిన మ్యాచ్‌లలో వైభవ్ సూర్యవంశీ, సమీర్ రిజ్వీ తమ పవర్ హిట్టింగ్‌తో అభిమానులను అలరిస్తున్నారు. వీరిద్దరూ తలో 11 సిక్సర్లతో అగ్రస్థానంలో కొనసాగుతున్నారు. ముంబై ఇండియన్స్ తరపున ఆడుతున్న రియాన్ రికెల్టన్ వంద పరుగులు కూడా పూర్తి చేయకుండానే ఏకంగా తొమ్మిది సిక్సర్లు బాదడం విశేషం. బెంగళూరు జట్టు నుంచి రజత్ పాటిదార్, టిమ్ డేవిడ్ సైతం చెరో తొమ్మిది సిక్సర్లతో గట్టి పోటీనిస్తున్నారు.

అత్యధిక సిక్సర్లు కొట్టిన ఆటగాళ్లు:
సమీర్ రిజ్వీ (ఢిల్లీ): 11
వైభవ్ సూర్యవంశీ (రాజస్థాన్): 11
రియాన్ రికెల్టన్ (ముంబై): 9
టిమ్ డేవిడ్ (బెంగళూరు): 9
రజత్ పాటిదార్ (బెంగళూరు): 9

ఫోర్ల వర్షం కురిపిస్తున్న యశస్వి జైస్వాల్..

బౌండరీల పరంగా రాజస్థాన్ రాయల్స్ ఓపెనర్ యశస్వి జైస్వాల్ తన హవా కొనసాగిస్తున్నాడు. 19 ఫోర్లతో అతను మొదటి స్థానంలో ఉండగా, కోల్‌కతా ఆటగాడు అంగక్రిష్ రఘువంశీ 17 ఫోర్లతో తరువాతి స్థానంలో ఉన్నాడు. చెన్నై సూపర్ కింగ్స్ బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్ తనదైన శైలిలో ఆడుతూ 16 ఫోర్లు సాధించాడు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, సాధారణంగా ఫోర్ల జాబితాలో మొదటి ఐదు స్థానాల్లో ఉండే విరాట్ కోహ్లీ, ఈసారి కనీసం మొదటి 20 మందిలో కూడా లేకపోవడం చర్చనీయాంశంగా మారింది.

అత్యధిక ఫోర్లు కొట్టిన ఆటగాళ్లు:
యశస్వి జైస్వాల్ (రాజస్థాన్): 19
అంగక్రిష్ రఘువంశీ (కోల్‌కతా): 17
సర్ఫరాజ్ ఖాన్ (చెన్నై): 16
సాయి సుదర్శన్ (గుజరాత్): 13
ఫిన్ అలెన్ (కోల్‌కతా): 13

బహుమతుల పంట..

ఐపీఎల్ నిబంధనల ప్రకారం సీజన్ చివరలో అత్యధిక ఫోర్లు, సిక్సర్లు బాదిన ఆటగాళ్లకు ప్రత్యేక పురస్కారాలు అందజేస్తారు. గత ఏడాది సాయి సుదర్శన్ 88 ఫోర్లు కొట్టి పది లక్షల రూపాయల నగదు బహుమతిని గెలుచుకున్నాడు. ఈ ఏడాది కూడా అదే జోరును కొనసాగిస్తూ 13 ఫోర్లతో రేసులో ఉన్నాడు. యువ ఆటగాళ్ల మధ్య నెలకొన్న ఈ పోటీ టోర్నీని మరింత రసవత్తరంగా మారుస్తోంది.

# దియా మీర్జా పార్ట్ టైమ్ ప్రొఫెషన్!



పదేళ్ల క్రితం వరకూ బాలీవుడ్ లో బిజీ బీజీ గా గడిపిన దియా మీర్జా వేగం ఒక్కసారిగా తగ్గిన సంగతి తెలిసిందే. అటు పై అమ్మడు వివాదాస్పద అంశాల పై స్పందించడం...సామాజిక దృక్కోణం లో ఎక్కువగా హైలైట్ అయింది. చేతి లో సినిమాలు లేకపోయే సరికి అమ్మడు కొత్త పంథాలో వ్యవహరించి మీడియాలో హాట్ టాపిక్ గా మారేది. ఈ క్రమంలో దియా కొన్ని రకాల బాధ్యతలు తీసుకుని వాటిని నిర్వర్తించే పని లో పడింది. తాజాగా అమ్మడి కెరీర్ జర్నీ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ఆ వేంటో ఆమె మాటల్లోనే. అదే స్టైల్.. అదే స్వాగ్.. పవర్ ప్యాక్డ్‌గా రజనీ 'జైలర్' ట్రైలర్'నటన పై ఆసక్తి ఉన్నా..అవకాశాలు వస్తున్నా తప్పని పరిస్థితుల్లో పార్ట్ టైమ్ నటిగా కొనసాగాల్సి వస్తోంది. నాకు అంతకు మించి వేరే మార్గం కనిపించడం లేదు. ప్రస్తుతం యుఎన్ఈబీ రాయబారిగా కొనసాగుతున్నా. ఐక్యరాజ్య సమితి తరుపున పనిచేయడం ఓ బాధ్యతగా భావిస్తున్నా. ఇటీవల యుఎన్ఈబీ అధినేత భారత్ కి వచ్చినప్పుడు ఇదే విషయం చెప్పాను. పర్యావరణాన్ని సంరక్షించుకోవడం అత్యంత అవసరమైన కార్యక్రమం. %ూశ్రీంశీ =ఋుం% – 'రానా నాయుడు' బ్యూటీ హీరోతో లవ్ ట్రాక్ దీని పై తప్పకుండా పనిచేస్తా. ఆ దిశగా కొన్ని ప్రణాళికలు సిద్ధం చేసి పెట్టుకున్నా. దాంతో పాటు ఎదుగుతోన్న నా పిల్లల్ని దృష్టి లో పెట్టుకుని నేను నడుచుకోవాల్సి ఉంది. వాళ్ల మెరుగైన భవిష్యత్ కి బాట వేయడం తల్లిగా నా బాధ్యత. ఇలా ఇన్ని బాధ్యతలు నాపై ఉన్నాయి. అందుకే సినిమాల కు పూర్తి స్థాయి లో సమయం కేటాయించలేకపోతున్నా. రెండింటినీ బ్యాలెన్స్ చేయడం అంటే అంత ఈజీ కాదు. సినిమాల్లో బిజీ అయితే క్షణం తీరిక సమయం దొరకదు. షూటింగ్ ఇల్లు తప్ప మరే ఇతర పనులు చేయలేం. కుటుంబం..పర్యావరణం మించి ఏదీ ముఖ్యం కాదని సినిమాల్ని లైట్ తీసుకున్నా. ఇక పై నా లో ఇంకా చాలా మార్పులు రావొచ్చు' అని తెలిపారు. ప్రస్తుతం దియా మీర్జా – తాప్సీ నిర్మాణం లో తెరకెక్కుతోన్న 'థక్ థక్' అనే చిత్రంలో నటిస్తోంది. దియా మీర్జా హైదరాబాద్ కి చెందిన నటి అన్న సంగతి తెలిసిందే.

# 'వృషకర్మ' మైండ్ బ్లోయింగ్ బిజినెస్.. నాగచైతన్య కెరీర్‌లోనే బిగ్ డీల్!



నాగచైతన్య ఈసారి నెవ్వర్ బిఫోర్ అనే కంటెంట్ తో రాబోతున్న విషయం తెలిసిందే. నాగచైతన్య ఈసారి నెవ్వర్ బిఫోర్ అనే కంటెంట్ తో రాబోతున్న విషయం తెలిసిందే. లవ్ స్టోరీ, తండేల్ సినిమాలతో బిగ్ హిట్స్ అందుకున్న ఈ అక్కినేని హీరో ఈసారి కంప్లీట్ గా జోనర్ మార్చాడు. కార్తీక్ దండు దర్శకత్వంలో 'వృషకర్మ' సినిమా రోజురోజుకు మంచి హైప్ క్రియేట్ చేసుకుంటోంది. ఇప్పటివరకు వచ్చిన కంటెంట్ అన్ని వర్గాల ఆడియెన్స్ ను ఎట్రాక్ట్ చేసింది. దర్శకుడు కార్తీక్ తన మొదటి సినిమా విరుపాక్షతో ఎలాంటి సెన్సేషన్ క్రియేట్ చేసాడో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఇప్పుడు అంతకుమించి నాగచైతన్యతో ఒక డిఫరెంట్ థ్రిల్లర్ ను చూపించబోతున్నాడు. ఇక ఈ సినిమాకు సంబంధించి రైట్స్ కోసం ప్రముఖ డిస్ట్రిబ్యూటర్స్ పోటీ పడ్డారు. ఇప్పటికే నాన్ థియేట్రికల్ గా మంచి డీల్స్ సెట్టయినట్లు తెలుస్తోంది. ప్రొడ్యూసర్‌గా మారిన క్రేజీ డైరెక్టర్! ఇక ఆంధ్రప్రదేశ్, తెలంగాణ కర్ణాటక థియేట్రికల్ హక్కుల కోసం కూడా భారీ ఆఫర్లు వచ్చాయి. అయితే ఆ మూడు రాష్ట్రాల హక్కులను ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత నాగవంశీ దక్కించుకున్నట్లు తెలుస్తోంది. దాదాపు రూ. 45 కోట్లకు దక్కించుకున్నట్లు అంచనా. మరో హైలెట్ ఏమిటంటే నాగచైతన్య కెరీర్‌లోనే ఇది అత్యధిక ప్రీ రిలీజ్ బిజినెస్ అని తెలుస్తోంది. తండేల్ వంటి భారీ విజయం తర్వాత చైతన్య నటిస్తున్న చిత్రం కావడంతో డిస్ట్రిబ్యూషన్ వర్గాల్లో ఈ స్థాయిలో పోటీ నెలకొంది.



బాలీవుడ్ యంగ్ బ్యూటీ సారా అలీఖాన్ బ్యాక్ టూ బ్యాక్ సక్సెస్ లతో దూసుకుపోతున్న సంగతి తెలిసిందే. 'గ్యాస్ లైట్'..'జర హట్ కే జర బచ్ కే'..'యే వతన్ మేరా వతన్' లాంటి విజయాలతో రెట్టింపు ఉత్సాహంలో కనిపిస్తుంది. ప్రస్తుతం అమ్మడి ఖాతాలో హిందీలోనే నాలుగు సినిమాలు రెడీగా ఉన్నాయి. అవి గాక కొత్త అవకాశాలు క్యూలో ఉన్నాయి. ఇటు టాలీవుడ్ లో మంచి అవకాశం ఎదురుచూస్తుంది. ఆ ఛాన్స్ వస్తే రెక్కలు కట్టుకుని వాలిపోవాల ని చూస్తుంది. జాన్వీకపూర్..అలియా భట్.. కియారా అద్వాణీ లాంటి భామలు తెరంగేట్రం చేయడంతో ! ఆ ఛాన్స్ తనకెప్పుడో వస్తుందా? అని ఎదురు చూస్తుంది. వ్యక్తిగతంగా తనను తాను స్పెషల్ గా ఫోకస్ చేసుకోవడంలో అమ్మడు ఎప్పుడు ముందుంటుంది. ఫ్యాషన్ వరల్డ్ లో దూసుకుపోవాలంటే? అందాల ప్రదర్శన తప్పని సరని భావించిన అమ్మడు ఎప్పటికప్పుటు టెంప్టింగ్ ఫోటోలతో కాకలు పుట్టించడం మామూలే. %ూశ్రీంశీ =ఋుం% - 'రానా నాయుడు' బ్యూటీ హీరోతో లవ్ ట్రాక్ డిజైనర్ దుస్తుల్లో అగ్గి రాజేసే అందాలతో కుర్రాళ్ల హృదయాల్ని ఛిద్రం చేసేస్తుంది. తాజాగా సారా అలాంటి ఫోటోతో ముందుకొచ్చేసింది. ఇదిగో ఇక్కడి లా ఎద అందాల ఆరబోతతో సలపరం పుట్టిచే బాధ్యతలు తీసుకుంది. బిగువైన లో దుస్తుల్లో అందాల అరబోతకి మతి చెండాల్సిందే. డిజైనర్ రవికలో సారా క్లీవేజ్ సెగలకి చెమటలు పట్టడం ఖాయం. రకరకాల భంగిమల్లో అమ్మడు ఫోజులిప్పుడు సంచలనంగా మారాయి. ఓ భంగిమలో అమ్మడు మలైకా హిప్ ని హైలైట్ చేసిన విధానం సూపర్బ్. ప్రస్తుతం ఈ ఫోటోలు నెట్టింట వైరల్ గా మారాయి. సారా అందాలకి ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు. తమదైన శైలిలో కామెంట్లు గుప్పించి సంబర పడుతున్నారు. సారా ఇలాంటి సంచలనాలతో మమ్మల్ని మరింత మురిపించాలంటూ కామెంట్లు పోస్ట్ చేస్తున్నారు.

# ఎద అందాల్లో సారా చిత్తు చిత్తు చేస్తోందే!

PRINTED,PUBLISHED, OWNED BY TEHELKA MEDIA NETWORK , DIGITAL NEWS .Regd no : 2019/ 28814 ,EDITOR: K.CHANDRA SHEKHAR,
EXCUTIVE EDITOR : K. SRINIVAS RAO,G6,Madhuranagar,yousufguda,HYDERABAD-500045.e-mail:Tehelkamedianetworks@gmail.com